

కథ 2001

18

# బతుకు

కన్నెగంటి చంద్ర

సెప్టెంబర్ 10.

పికప్ ట్రక్ గాడెవడో సిగ్నలేయకుండానే చటుక్కున లైనుమారి బ్రేక్ కొట్టాడు. తిక్కరేగింది వాసుకి. 'యీడెమ్మ...' తిట్టుకున్నాడు తనూ బ్రేక్ పెడల్ గట్టిగా నొక్కుతూ.

కోపమొచ్చినప్పుడు తను చిన్నప్పుడు నేర్చుకున్న తిట్లలోకి దిగిపోవడం మామూలయిందతనికి. కార్లో ఇంకెవళ్లయినా ఉన్నప్పుడు ఇంగ్లీషులో తిట్టటం కూడా.

'ప్రతివాడూ ఫాస్ట్ లేన్‌లోనే వెళ్లాలంటే ఎలా కుదురుతుంది? కళ్లు మూసుకుని సూటిగా వచ్చే యటమే పక్కకి తిరిగికూడా చూడకుండా. చంపాలనా, చావాలనా?' విసుక్కున్నాడు.

కాస్త నెమ్మదించేలోగానే ట్రాఫిక్ వేగం కూడా తగ్గింది. పక్క లైన్ మరీ నెమ్మదిగా పోతూంది. ముందున్న పికప్‌కీ దాని ముందున్న కారుకీ మధ్య దూరం పెరుగుతోంది. వాసులో అసహనం కూడా.

'వీడు పోడు, నన్ను పోనివ్వడు. స్పీడ్ లిమిట్ దాటకూడదని రూలు పెట్టుకున్నట్టున్నాడు,' మళ్లీ తిట్టు కున్నాడు. పికప్ వెనుక అద్దం మీద కాల్విన్ వుచ్చ పోస్తున్నాడు ఫోర్డ్ లోగో మీద.

ముందు వరుసగా ఎర్రగా బ్రేక్ లైట్లు. సాఫీగా సాగిపోతున్న ట్రాఫిక్ చటుక్కున ఆగిపోయింది. 'ఇక ఇది కదలదు.'

స్టాక్ మార్కెట్ గుర్తొచ్చింది అలవాటుగానే. ఇది కూడా పైకి కదలదు. అప్పుడే సొమ్ము చేసుకుని వుంటే... ఇప్పుడనుకుని ఏం లాభం? తల్చుకుంటే తేరుకోలేని డిప్రెషన్...

సెల్ మోగింది. ప్రసాద్... రోజులు బాగుండే ప్పుడు బిజినెస్‌లో ఒకరికొకరు సాయం చేసుకునే వాళ్లు. పైకి కనపడని పోటీ కూడా.

"హలో ప్రసాద్! ఏమిటి ఎట్లా ఉంది బిజినెస్?"

"కొత్తేముంది? మొన్ననే ఇంకో నలుగుర్ని ఫ్లైటె క్కించాం! పెద్ద పెద్ద కంపెనీలు కూడా బీదరుపులు అరుస్తున్నాయి కదా? అక్కడెట్లా ఉంది?"

"మేం కూడా ఇంటికి పంపించేస్తున్నాం. ఈ నెలాఖరుకి ఇంకో ఇద్దరు బెంచ్ మీదికొస్తున్నారు. ఏం చేయాలో!" తెలియకుండానే ఒక నిట్టూర్పు.

"ఇట్లాగే ఉంటే ఇక ఐపీ పెట్టేయాల్సిందే! ఇక్కడ కంపెనీ ఎపార్ట్‌మెంట్ కూడా ఖాళీ చేద్దామని చూస్తున్నా. ఇంకో ఇద్దరున్నారు. మీ ఎపార్ట్‌మెంట్లో ఏమన్నా సర్దుకో వచ్చేమోనని కాల్ చేస్తున్నా!"

వొట్టి కబుర్లు. మార్కెట్ ఊపులో ఉన్నప్పుడు కోతలు తెగ కోసేవాడు గోరంతలు కొండంతలు చేసి. కొంచెం గాలి ఎదురుతిరిగేసరికి బొత్తిగా రోడ్డున పడి పోయినట్టు ఏడుపులు. స్టాక్ ప్రైస్‌లాగే... అనుకుని నవ్వుకున్నాడు.

"లేకపోతే చెప్పు ఫర్వాలేదు. వాళ్లనీ ఫ్లైటెక్కిం చేస్తా. ఇక లాభంలేదు." ఎంతవరకూ నమ్మాలో తెలీదు. అతని మాటల్లో ఎప్పుడూ సగం కంటే నిజముండదు. ఏ సగమన్నది ఎప్పటికో కానీ తెలియదు.

"చూద్దాం! పొజిషన్ చెక్ చేసి చెప్తా!"

"బై," చెప్పి పెట్టేశాడు. మనసులో ఓ మూల తృప్తి. తను ఒక్కడే కాదు ఈ మునిగిపోతున్న పడవలో ఉంది. రన్‌వే మీద జోరందుకున్న విమానం పైకి ఎగరా ల్సింది పోయి ట్రాఫిక్‌జాంలో ఇరుక్కున్నట్టయిపో యింది. ఈ ఏడు రెవెన్యూ పది మిలియన్లవుతుందని వేసుకున్న అంచనా తారుమారై అత్యాశగా మిగిలి

పోయింది. కొత్త ప్రాజెక్ట్ దొరకటం కనాకష్టమవుతూంది నానాటికీ. కన్సల్టెంట్స్ సగం కంటే మిగల్లేదు. ఇట్లాగే సాగితే ఇంకో ఆర్నెల్లలో బిజినెస్ మూసేసుకోవటమే మంచిది.

ట్రాఫిక్ కదలదు. ముందు ఏక్సిడెంట్ అయిం దేమో తెలియదు. కాల్విన్ ఇంకా వుచ్చ పోస్తూనే వున్నాడు. అసలు ఇంత పొద్దున్నే రాకుండా ఉండవల సింది. తెల్లవారుజామున మెలకువ వచ్చి ఇక నిద్ర పట్టలేదు మార్కెట్ సంగతి బుర్ర తినేస్తుంటే.

సెల్ మళ్లీ మోగింది, సాయి... ఆఫీసు పనులూ, మార్కెటింగూ చూస్తాడని ఇండియా నుంచి తెప్పించి పెట్టుకున్న చుట్టాలబ్బాయి.

''ఏమిటి సాయీ?''

''ఆ బాబ్ రిచర్డ్‌తో మాట్లాడాను. ఇవాళ లంచికి కలుద్దామన్నాడు.''

''ఓహ్... గుడ్!'' అంత గుడ్ ఏంకాదు. అల వాటయి... అంతే. వెధవ తిని తాగి పోతాడు. ఎప్పుడో మొదలయ్యేదో, అసలు మొదలుకానిదో ప్రాజెక్ట్ కోసం వాడిని మేపక తప్పదు.

''నారాయణ మళ్లీ ఫోన్ చేశాడు. పోయిన నాలుగు నెలల జీతం ఇవ్వకపోతే కోర్టు కెళతాడట!''

''వాడి మొహం! అప్పుడు కాళ్లావేళ్లా పడ్డాడు. జీత మివ్వకపోయినా పర్లేదు ఫైర్ చేయొద్దని. ఇప్పుడీ వేషాలా? నేను ఆఫీసుకే వస్తున్నా, వచ్చాక చూద్దాంలే వాడి సంగతి!'' పెట్టేశాడు ఫోన్. ఈ నారాయణగాడితో పెద్ద తలకాయ నొప్పి. పరిస్థితి అర్థం చేసుకోడు. అమా యకుడల్లే కనిపించాడప్పుడు. మనుషుల్ని నమ్మటానికి లేదు. ఎట్లా వదిలించుకోవాలో ఆలోచించాలి.

మాటల్లో ఎప్పుడో ట్రాఫిక్ కదిలింది. ఏక్సిడెంటూ లేదు, ఏమీలేదు. ఆ ముడి ఎందుకు పడి ఎట్లా వదు లయిందో తెలియదు.

సెల్ మళ్లీ మోగింది. ఇంటి నుంచి.

''ఏమిటి రాజీ? డ్రైవ్ చేస్తున్నా!''

''సాయంత్రం త్వరగా ఇంటికి వస్తారేమోనని...''

రాడు. పగలంతా వాడికీ వీడికీ ఫోన్లు చేసీ, ఆ ఎకవుంట్స్ చూసుకునీ చూసుకునీ విసుగెత్తాక సాయం త్రం బార్‌కి చేరుకుని ఓ రెండు గంటలు కాస్త రిలాక్స్ అవందే కుదరదు. మిగతా వాళ్లతో బాతాఖానీ, నెట్వ ర్కింగూ ఇంకోడి ఏడుపులో తోడు దొరికిన ఓదార్పూ.

''మాట్లాడరేం?''

''ఎందుకు?''

''చిట్టికి మ్యూజిక్ స్కూల్లో ఫంక్షన్ ఉంది ఆరింటికి!''

''నాకు కుదరదులే!''

''సరేలెండి అయితే!''

పెద్ద గొడవ చెయ్యదెప్పుడూ. పిల్లల పనంతా తానే చూసుకుంటుంది. సంపాదిస్తున్నాడనో ఏమో తన మానానికి తనని వదిలేస్తుంది.

*

సెప్టెంబర్ 11.

నిద్ర లేచేసరికి ఆలస్యమయింది. లేస్తూనే రోజూ లానే, 'ఇవాళ ఒక ప్రాజెక్టయినా సంపాయిస్తాను,' అను కున్నాడు ప్రతిజ్ఞ చేస్తున్నవాడిలా. డైనింగ్ టేబుల్ దగ్గరికి వచ్చేసరికి ఇడ్లీ ప్లేట్ సిద్ధంగా ఉంది. కూర్చోబోతూ టీవీ ఆన్ చేశాడు మార్కెట్ వార్తల కోసం. అంతా గోలగా, గందరగోళంగా ఉంది. ఏమవుతూంది? అదేమిటి? ఎట్లా? ఎందుకు? ఓర్నీ! అయ్యో!

విధ్వంసం... వినాశనం... నిలువెత్తు మనిషి కణతలకి గురిపెట్టి వదలగా దూసుకొస్తున్న బులెట్లా విమానం... నెత్తురు చిమ్మినట్టు భగ్గున మంటలూ... అదే దృశ్యం మళ్లీ మళ్లీ తెర మీదా, మనసులోనూ... మరెన్నటికీ మర్చిపోకుండా మళ్లీ మళ్లీ దిద్దీ దిద్దీ...

అవి గర్వమూ, అహంకారాలా? మనిషి ఎగరేసిన విజయకేతనాలా? నిబ్బరంగా నగరాన్ని కాపుకాచే పెద్ద మనుషులా? నిలువునా చెట్లు కూలుతున్నట్టు... పక్షు లయితే ఎగిరిపోయే వీలుండేది... అర్థాంతరంగానే ముగిసిపోతున్న ఆఖరి సందేశాలు... ఎంత జాగ్రత్తగానో నిర్మించుకున్న భవనాలూ, జీవితాలూ క్షణాల్లో నామ రూపాల్లేకుండా ముక్కలు ముక్కలుగా విరిగి తునిగి... రెండు పెద్ద సమాధులుగా మిగిలి...

బెదిరిపోయిన మనుషులు... భీతిల్లిన కళ్లు... చావును తాకి తిరిగివచ్చిన ఆనవాళ్లు... నగరం నడి బొడ్డున అప్రకటిత యుద్ధం... యుద్ధమే పెద్ద అవినీతి... ఇక యుద్ధంలో నీతేమిటి? నిరాయుధంగా, నిస్స హాయంగా, నిరాశ్రయంగా... ఎక్కడికని పారిపోతారు వొంటినిండా వల్లకాటి బూడిద రాసుకుని? అకార ణంగా, అకస్మాత్తుగా... ఎవరికీ పీడకలగా కూడా వచ్చి ఉండదు. అప్పటికింకా ఎవరో జోకు సగం మాత్రమే చెప్పి వుండాలి. ఎవరిదో నవ్వు సగంలోనే తెగిపోయి ఉండాలి. ఎవరిదో కాఫీ కప్పు సగం నిండుగానే ఉండి ఉండాలి... ఎవరిదో ఆశ అసలు తీరకపోయి ఉండాలి.

భయాందోళనల మధ్య ఒకటొకటే బయటి కొస్తున్న జాలి కథలు హృదయవిదారకంగా... భర్తలూ, భార్యలూ, పిల్లలూ, తండ్రులూ, తల్లులూ, తోబుట్టు వులూ... రోదనలూ, దుఃఖాలూ, కన్నీరూ...

దిమ్మ తిరిగిపోయిందతనికి. గుండెల్లో ఎక్కడో బెదురూ, వణుకూ. ముందు ఇది హార్ట్ ఎటాక్ కాదుకదా అన్న భయం ఒకటీ! ఇక భద్రజీవితమంటూ లేదు. భూమండలంలో ఎక్కడా శత్రువులేని సురక్షితమైన ప్రదేశం లేదు.

ఆరోజు తిన్నా తిననట్లే ఉంది. తినకున్నా తిన్నట్లే ఉంది. చాలామందిలానే టీవీని చూస్తూ ఒక సామూహిక దుఃఖంలో మునిగి అందులోనే కలిసిపోయాడు.

*

సెప్టెంబర్ 12.

పొద్దున్నే లేచి చిట్టి గదిలోకి వెళ్లాడు. పక్కనే పడుకుంటే కళ్లు తెరిచి ఆశ్చర్యంగా చూసింది. "డాడీ!" అంటూ. మెడ చుట్టూ చేతులు వేయగానే దగ్గరికి తీసుకుని హత్తుకున్నాడు. ఆ నులివెచ్చని స్పర్శను పూర్తిగా ఆస్వాదించడానికన్నట్టు కళ్లు మూసుకున్నాడు. రెప్పల వెనుక చెమరింతను దాచుకోవడానిక్కూడానేమో!

అంతలో బాబు తొంగి చూసి ఏదో అర్థమయినట్టు, "డాడీ," అంటూ ఎగిరి మంచంమీదికి దూకాడు. వాణ్ణి తనే పొట్టమీదికి ఎక్కించుకుని వాడు ఎగురుతుంటే "నెమ్మదిగా, నెమ్మదిగా!" అంటూనే నవ్వుతున్నాడు.

వీళ్ల గొడవకు వాళ్ల అమ్మ కూడా లేచి వచ్చింది. "ఏమిటివాళ పొద్దున్నే లేచారు?" అంటూ.

"మా ఇష్టం! కదరా చిట్టీ!"

"చిన్నా! తప్పు దిగమ్మా డాడీ మీదనించి!"

"మా ఇష్టం, మేం దిగం! కదమ్మా?" ముద్దు చేస్తున్నకొద్దీ పిల్లల గొంతుల్లో ఉత్సాహం హెచ్చుతూంది. "అవును, అవును!" అంటూ కేకలు.

మురుసుకుంటూ చూసింది తల్లి. పిల్లల అల్లరి తగ్గాక వాళ్లని వదిలి, లేచి ఆమెని దగ్గరికి తీసుకున్నాడు.

"అయ్యో, అదేమిటీ... పిల్లలు," వారిస్తూ నెమ్మదిగా అందామె.

"ఉత్తినే! When did I hug you last time?"

"అటు మొన్న రాత్రి అనుకుంటా!"

"ఛ! అందుకని కాదు. ఉత్తినే ఇట్లా ఏ కోరికా లేకుండా!"

ఆమె బదులివ్వలేదు. చేతులు మాత్రం అతన్ని చుట్టుకున్నాయి. పిల్లలూ లేచొచ్చి వాళ్లిద్దరినీ కలిపి చుట్టేశారు.

కాసేపయ్యాక చిట్టి అంది, "మనకివాళ బ్రేక్‌ఫాస్ట్ లేదా?"

నవ్వుతూ వదిలేశాడు ఆమెని.

వెళ్లి ఫోన్ అందుకుని వాళ్ల అక్కకి చేశాడు. "ఏమిట్రా ఈమధ్య అసలు ఫోన్ చేయటంలేదు. ఎప్పుడు చేసినా రజనీతోటే మాట్లాడటమవుతుంది!"

"ఏం లేదక్కా కొంచెం పనుల్లో బిజీగా ఉన్నా!"

"ఇంటికి కూడా చేయటం లేదటగదా? ఎప్పుడు ఫోన్ చేసినా అమ్మానాన్నా నన్నడుగుతారు!" నిష్టూరంగా అంది.

"లేదు, ఇప్పుడు చేస్తాను నీతో మాట్లాడాక! పిల్లలెట్లా ఉన్నారు? నిన్న బాగా భయపడ్డారా?" చాన్నాళ్లయినట్టుంది అక్కతో మాట్లాడక. అక్కతో మాట్లాడాక ఎందుకో చిన్నప్పుడు తాము కలిసి ఆడుకున్న ఆటలు గుర్తొచ్చాయి.

చుట్టుపక్కల దుడుకు పిల్లల నుంచి తనని ఎప్పుడూ ఒక కంట కనిపెట్టి రక్షించుకుంటూ. ఎప్పుడో, ఎక్కడో దూరం పెరిగిపోయింది. ఆరొందల మైళ్ల దూరంలోనే ఉన్నా ఏడాదికోసారి కలవటం మాత్రమే అక్కాతమ్ముళ్ల బంధానికిగాను మిగిలింది ఇప్పుడు. ఎప్పుడో బిజినెస్‌కి పనికొస్తారని కాంటాక్ట్‌లో ఉంచుకోవటం కోసం ముక్కూ మొహం తెలీనివాళ్లకి రోజూ ఫోన్ చేసే తను...

ఇండియాకి కూడా ఫోన్ చేస్తే వాళ్లూ సంతోషించేరు. "బాగా కంగారుపడుతున్నామబ్బాయ్! టీవీలో ఏవేవో చూపిస్తున్నారు. మీరు అక్కడ లేరని తెలుసుగానీ ఎందుకో భయం!" అంటూ. ఆ ముచ్చటా ఈ ముచ్చటా చెప్పేసరికి వాళ్ల బెంగ తీరినట్టనిపించింది.

కిచెన్‌లోకి వచ్చేసరికి పిల్లలిద్దరూ స్కూల్‌కి సిద్ధమై ఉన్నారు.

"నేను డ్రాప్ చేస్తాలే రాజీ వాళ్లని!" చెప్పాడు. ఆమె తలతిప్పి చూసి నవ్వింది.

ఎదురుగా కిటికీలోంచి గులాబీలు గాలికి ఊగుతున్నాయి, చేతులూపుతూ పలకరిస్తున్నట్లు. ఆ మొక్క గుర్తుంది. ఎప్పుడో రాజీతో కలిసి తాను నాటిందే.

"ఆ యెల్లో రోజ్ చూడు ఎంత బాగుందో!" అతని మాటలకి ఆమె మళ్లీ నవ్వింది. "అది మొన్ననే పూసింది."

అతనూ నవ్వి ఆమెని దగ్గరికి తీసుకున్నాడు.

ఎక్కడో సన్నగా తన నిస్సహాయత గురించి భయం. ఆ మాయ మళ్లీ కమ్మేస్తుంది. మళ్లీ తను మామూలుగానే తన పనుల్లో మునిగిపోతాడు ఇన్ని ఆనందాల్ని వదులుకుని. అప్పుడు ఇంకో సెప్టెంబర్ 11 వస్తుందా? అసలు ఇందుకు ఒక సెప్టెంబర్ 11 రావలసి ఉందా?

*సుజనరంజని- సిలికానాంధ్ర సాంస్కృతిక ఉత్సవ ప్రత్యేక సంచిక, డిసెంబర్ 2001*